కథ

## డి.వాణీప్రభ

# మీరే కరెక్టండీ!



ప్రశాంతమైన వాతావరణం. నల్ల జరీచీర మీద బంగారుబుటాలా అక్కడక్కడ మెరిసే నక్షత్రాలూ... ఇవేమీ డాబా మీద కూర్చున్న నిర్మల మనసులో చోటు చేసుకోలేదు. నిన్నటి సంఘటన గురించే పదేపదే ఆలోచిస్తోంది నిర్మల. రఘు మనస్తత్వం తను బాగా ఎరిగినదే అయినా ఎందుకో మనసులో ముల్లు గుచ్చుకున్నట్లయింది.

నిన్న మధ్యాహ్నం రెండు గంటలకి నిర్మల మోకాళ్లు నెప్పులుగా ఉన్నాయని పడుకుంది. ఆదివారం సెలవు కాబట్టి ఆ వెసులుబాటు - మిగిలిన రోజుల్లో కుదరనే కుదరదు. ఈలోగా రఘు వచ్చాడు. మోకాళ్లు నెప్పులనగానే పకపకా నవ్వి "మరి రోజూ మార్నింగ్ వాక్ చెయ్యమంటే వినవు నువ్వు. థర్టీప్లస్‌లో ఆహారం కంటే ఆరోగ్యమే ముఖ్యం. ఆరోగ్యం కోసం శరీరానికి వ్యాయామం అవసరం" అన్నాడు.

నిర్మల కూడా ఊరుకోకుండా "వ్యాయామం చేసి ఒళ్లు తగ్గించుకోడానికి నేనేమన్నా ఖాళీగా కూర్చుంటానా? ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు క్షణం కూడా తీరుబడి ఉండదు. మళ్లీ నాకు వ్యాయామం ఒకటీ" అంటూ విసుక్కుంది అసలే కాళ్లు నిప్పులుగా ఉన్నాయన్న చిరాకుతో.

"ఇలా అంటావు కనకే నలభై ఏళ్ల నాకు ముప్పై ఏళ్లనీ, ముప్పై ఏళ్ల నీకు నలభై ఏళ్లనీ అనుకుంటారు" అని గర్వంగా అంటూ టి.వి. ఆన్ చేసి రిమోట్‌తో ఛానల్స్ మార్చసాగాడు.

రఘు నిజంగానే స్మార్ట్‌గా ఉంటాడు. అతనికి వారసత్వంగా వచ్చిన కాయ శరీరం, మంచి రంగు, హెయిర్ స్టైల్‌తో పాటు ఆరోగ్య ఆహార నియమాలు కూడా పాటిస్తూ మరీ తక్కువ వయసులా కన్పిస్తాడు. ఎవరైనా మీకు నలభై ఏళ్లా అని ఆశ్చర్యపడితే చాలా సరదాపడిపోతాడు వాళ్లని అంతలా ఆశ్చర్యపడేలా చేసినందుకు. నిర్మల కూడా ఉద్యోగస్తురాలే. తనూ మరీ ఊబకాయం కాకపోయినా ఆరోగ్యం గురించి పట్టించుకునేటంత తీరుబాటు లేని మనిషి. పైగా ఉదయమే స్కూలు, పిల్లల బాక్సులు, తనకీ, రఘుకీ అందరికీ అన్నీ సర్దే హడావుడిలో ఉండగా అవేమీ పట్టించుకోకుండా మార్నింగ్ వాక్ పేరుతో ఏడు గంటల వరకూ తిరిగి వస్తాడని రఘు మీద మండిపడుతూ ఉంటుంది.

రఘు వ్యక్తిగతంగా మంచివాడే కానీ వాళ్లతో వీళ్లతో పోల్చి నిర్మలని విసిగిస్తూ ఉంటాడు. నాలుగు రోజుల క్రితం "క్రింద వాటాలో శాంతిగారిని చూడు నిర్మలా! ఉదయమే స్నానం చేసి సుప్రభాతం చదువుకుంటూ తులసిచెట్టుకి ప్రదక్షిణలు చేస్తున్నారు చక్కగా- నువ్వెప్పుడూ అలా చెయ్యవేం?" అని కోపంగా ప్రశ్నించాడు.

"శాంతిగారికేంటీ- పిల్లలు బెంగుళూరులో చదువుకుంటున్నారు. ఆయనకి మధ్యాహ్నం ఆఫీస్ కేంటీన్‌లోనే భోజనం. ఉదయమే వంట చెయ్యాలన్న సమస్య లేదు. మనకి అలా కాదు ఒక్కపూట కొంచెం ఆలస్యమైతే అంతా అస్తవ్యస్తమే" అంటూ విసుక్కుంది నిర్మల. మడికట్టుకుని ప్రసాదం వండి, నైవేద్యం పెట్టడం కంటే గుక్కపెట్టి ఏడిచే చంటిబిడ్డ చేతిలో గుప్పెడు పరమాన్నం ముద్ద పెట్టడం ఎక్కువ దైవత్వం అంటుంది నిర్మల.

"అమ్మో! నీవన్నీ ప్రవమాదకరమైన భావాలు. నీదంతా వితండవాదం'' అంటాడు తాతలు, తండ్రుల సంరక్షణలో మడీ ఆచారాల మధ్య పెరిగిన రఘు.

"నిజాన్ని అంగీకరించడానికి చాలా ధైర్యం కావాలి" అని అతన్ని మధ్య మధ్యలో ఉడికిస్తూ ఉంటుంది నిర్మల.

క్రింద పిల్లలు ట్యూషన్ నుంచి వచ్చేసినట్లున్నారు. పెద్దగా మాటలు వినిపించడంతో క్రిందకి వెళ్లింది నిర్మల. నిద్రపోయే వరకు ఆలోచించి చివరికి ఒక నిర్ణయానికి వచ్చి ఆ చిరునవ్వుతోనే నిద్రలోకి జారుకుంది.

○○○

మర్నాడు ఉదయం రఘు మార్నింగ్ వాక్ ముగించి

వచ్చేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. దగ్గరగా లాగి ఉన్న తలుపులు తోసుకుని నెమ్మదిగా ఇంట్లోకి వెళ్లేసరికి వాతావరణం అంతా విచిత్రంగా తోచింది. పిల్లలిద్దరూ హాయిగా దుప్పటి కప్పుకుని నిద్రపోతున్నారు. వంటింట్లో కుక్కర్ కూతలూ, కూరగాయల కోతలూ, గిన్నెల మోతలూ ఏమీలేవు. ఆశ్చర్యకరమైన నిశ్శబ్దం ఇల్లంతా అలుముకుని ఉంది. అసలు ఇన్ని కూతలకీ, మోతలకీ మూలకారణం నిర్మలేదీ? రెండు అటాచ్డ్ బాత్రూములూ, క్రింద కుళాయి దగ్గరా వెతికాడు. ఎక్కడా లేదు.

ఈరోజు ఆదివారం కానీ కాదు కదా అని సందేహంతో కేలండర్ చూసాడు. నమ్మకం కుదరక సెల్ తీసి చూసాడు. మంగళవారం ఉదయం 7.20 నిమిషాలు. సామాన్యంగా ఈ టైమ్‌కి పిల్లలని కేకలేస్తూ వాళ్ల నోట్లో టిఫిన్ కుక్కుతూ పెద్ద హడావుడి చేస్తూ ఉంటుంది. అలాంటిది ఈ రోజేమైంది, పైగా సెలవు కూడా కాదు. వాకింగ్ నుంచి రాగానే పదే వేడి, వేడి కాఫీ పడక బుర్ర వేడెక్కి, తలనెప్పి కూడా మొదలయింది. పిల్లలని లేపి రెడీ చేద్దామని దుప్పటిలాగి లేపడం మొదలుపెట్టాడు. చిన్నాడు ఎంత లేపినా రబ్బరుముద్దలా సాగుతున్నాడు తప్ప మంచం దిగడం లేదు. వాడిని నెమ్మదిగా సాగదీసి మంచం మీద నుంచి దింపేసరికి పెద్దాడు "డాడీ! నేను టెడ్డీ బొమ్మ గీసాను రండి" అంటూ చెయ్యి పట్టుకుని లాక్కెళ్లాడు. తీరా చూస్తే నేల మీద పేస్ట్ ట్యూబ్ అంతా పిండేసి టెడ్డీ బొమ్మ గీసేసాడు. వాడి వీపు మీద ఒకటి పీకుదామంటే ప్రొద్దునే సంగీత కచేరీ మొదలుపెడతాడేమోనని భయం వేసింది. చిన్నాడి చేత బ్రష్ చేయించేసరికి తలప్రాణం తోకకొచ్చింది. ఈలోగా వంటింట్లో చప్పుడు విని గబగబా వచ్చేసరికి నిర్మల కాఫీ కలుపుతోంది.

ముదురు నీలం మీద లేత నీలం టాప్‌తో ప్లెజెంట్‌గా కన్పిస్తున్న తనని చూసి ఆశ్చర్యంతో "ప్రొద్దుటే గుడికి వెళ్లావా? ఏమిటి విశేషం?" అన్నాడు. "గుడి కాదండీ - రోజూ మార్నింగ్ వాక్‌కి వెళ్లమంటున్నారు కదా అని ఇవాళ కొంచెం తొందరగా లేచి రెండు కిలోమీటర్లు నడిచి వచ్చాను. వళ్లంతా భలే తేలిగ్గా ఉంది" అని నవ్వుతూ చెబుతున్న నిర్మలని అయోమయంగా చూస్తూ "నీకూ పిల్లలకీ స్కూల్ లేదా?" అన్నాడు రఘు.

కాఫీ కలిపి అందిస్తూ "ఎందుకు లేదూ - పిల్లలని మీరు రెడీ చేసేసారు కదా.. నేను స్నానం చేసి వస్తాను" అంటూ తువ్వాలు అందుకుని బాత్రూంలోకి వెళ్లి తలుపేసుకుంది.

'నేనెక్కడ రెడీ చేశానూ' అని మనసులో అనుకుంటూ పిల్లలకి వేరే బాత్రూంలో స్నానం చేయించాడు. వాళ్లిద్దరూ తిట్టుకుంటూ తన్నుకుంటూ యూనిఫాం వేసుకుంటుంటే కేరేజి సంగతేమిటో అర్థంకాక జుట్టుపీక్కుంటున్నాడు రఘు.

నిర్మల హాయిగా స్నానం చేసి వచ్చి పట్టుచీర కట్టుకుని పూజగదిలోకి వెళ్లిపోయింది. ప్రశాంతంగా హనుమాన్ చాలీసా చదువుకుంటున్న నిర్మలని చూసి ఇంక ఆగలేక "పిల్లలకి బాక్స్ సర్దావా? టిఫిన్ ఏదీ?" అన్నాడు.

"నేను సరిగా పూజలవీ చెయ్యక పాపం మీకేం కలిసి రావడం లేదు అందుకే ఇంక నిత్యం పూజ చేసి, దీపం పెట్టుకుందామనుకుంటున్నాను. నిన్న రాత్రి చపాతీలు మీరూ, పిల్లలూ తినెయ్యండి. మధ్యాహ్నం వాళ్ల స్కూలు మీ ఆఫీస్ దగ్గరే కనుక ఏదైనా తినిపించండి" అనేసి మళ్లీ హనుమాన్ చాలీసాలో మునిగిపోయింది నిర్మల.

'ఈపాటికి వేడివేడి కాఫీ రెండో రౌండ్ తాగుతూ పేపర్ చదువుకునేవాణ్ణి ఇవాళేంటో అంతా తారుమారయింది' అని గొణుక్కుంటూ రెడీ అయ్యి పిల్లలని తీసుకుని ఆఫీస్‌కి వెళ్లిపోయాడు రఘు.

ఇంకొక పదినిముషాల తర్వాత నిర్మల కూడా బయల్దేరింది.

సాయంత్రం ఆఫీస్ నుంచి వచ్చాక టీ తాగుతూ నిర్మల "ఉదయం నీరెండలో ప్రశాంతంగా మార్నింగ్ వాక్ చేస్తుంటే ఎంత హాయిగా ఉందండీ- రేపట్నుంచి ఇంకొంచెం ఎక్కువ దూరం నడవాలని అనుకుంటున్నాను" అంది కొంచెం కొంటెగా.

రఘు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది.

"మరి పిల్లలు... స్కూలు..." అని నస్సగా గొణిగాడు కానీ నిర్మల వెంటనే అందుకుని "మీరు నాకంటే ముందే వస్తారుగా కొంచెం రెడీ చేసెయ్యచ్చుగా- టిఫిన్‌కి బ్రెడ్, జామ్ తెప్పించేస్తాను" అంది అతని మొహంలో ఫీలింగ్స్‌ని గమనిస్తూ.

వెంటనే రఘు ఇంక లాభం లేదనుకుని "నిర్మలా - నీకు నువ్వు చేసే పనే ఎక్కువ. మార్నింగ్ వాక్ అంత అవసరం లేదనుకుంటాను" అన్నాడు ఉదయం సీన్ గుర్తు చేసుకుంటూ-

కానీ నిర్మల ఊరుకోకుండా "మీరే కదండీ - ఈ వయసులో ఆహారం కంటే ఆరోగ్యం ముఖ్యం అన్నారూ? అందుకే అంత కష్టపడి ఉదయమే లేచి వెళ్లాలనుకుంటున్నాను. పైగా కాస్త పూజ, భక్తీ కూడా ఉండాలి కదండీ. ఎంతసేపూ వండుకున్నామా? తిన్నామా? పడుకున్నామా? అని ఒకటే రొటీన్. కాస్త పూజ, భక్తీ కూడా ఉండాలి కదా" అంటే కక్కలేక మింగలేక అవునన్నట్లు తలాడించాడు రఘు. అతని అవస్థ చూసి మనసులోనే నవ్వుకుంటూ టీ కప్పులు తీసుకుని లోపలకి వెళ్లిపోయింది నిర్మల.

అలా ఒక వారం రోజులు నిర్మల మార్నింగ్ వాక్‌కి వెళ్లి వచ్చేసరికి పిల్లలని రెడీ చెయ్యడం రఘు డ్యూటీ అయ్యింది.

వచ్చి కాఫీ తాగి నిత్యం ధూప దీపార్చనలు, స్తోత్ర పారాయణలతో ఇల్లంతా హోరెత్తించెయ్యడం నిర్మల పనిలాగా గడిచింది.

వెరైటీ టిఫిన్లు, కేరేజీలు లేక పిల్లలు వెర్రిమొహాలేసారు. నిర్మలనేమీ అనలేక రఘు బిక్కమొహమేశాడు.

చివరికి ఆదివారం కొంచెం తీరికగా ధైర్యం తెచ్చుకుని "నిర్మలా కాస్తంత ప్రాక్టికల్ థింకింగ్ ఉండాలోయ్. పిల్లలకి తిండీ తిప్పలూ లేకుండా నీకు ఈ మార్నింగ్ వాక్‌లూ, పూజా పునస్కారాలూ అవసరమంటావా?" అన్నాడు కాస్త విసురుగా.

నిర్మలకి అతనికి విషయం అర్థమైనందుకు చాలా నవ్వొచ్చేసింది. అనుభవంలోకి వస్తే కానీ ఏది నిజమో తెలీదు అనుకుంటూ నవ్వు కళ్లతో అమాయకంగా అతని మొహంలోకి చూస్తూ "మీరే కదండీ... కిందింట్లో శాంతి..." అంటూ ఏదో అనబోయింది.

ఇంతలోనే "నువ్వారికే నటించకు మహాతల్లీ...వీళ్ళకి వళ్లు రుద్ది స్నానాలు చేయించలేక నే చస్తున్నా! పొరపాట్న అన్నాలే మార్నింగ్ వాక్ చెయ్యమని - నన్నొదిలెయ్" అని రెండు చేతులూ జోడించాడు.

"అలా రండి దారికి. ఒక్క వారం రోజుల్లో విషయం సెటిల్ అయింది. నేనేదో తీరుబడిగా కూర్చున్నట్లు నన్ను వెటకారం చెయ్యడం కాదు. చెయ్యకపోతే తప్ప నేను చేసే పనేంటో మీకు తెలీదు. నిజానికి ఇంటి కోసం, పిల్లలకోసం, మీ కోసం నా ఇష్టాయిష్టాలనీ, ఆరోగ్యాన్నీ, ఆనందాన్నీ త్యాగం చేసినా అదే నాకు ఎక్కువ ఆనందం" అని మనసులోనే అనుకుంది. పైకి అని బాధపెట్టడం ఇష్టంలేక-

పైకి మాత్రం "మీరలా అంటే నేను మాత్రం ఇంకేమంటాను. కాకపోతే ఇక నుంచీ పనంతా నామీద తోసి మీరు పేపర్ చదువుతూ కూర్చుంటే వూరుకోను. అన్ని పనుల్లో కాస్త సాయం చేయాల్సిందే. పదండి ఆలుగడ్డలు తరగిస్తే క్షణంలో వంట చేసేస్తా" అంటూ చెంగుదోపి ఛెంగున గెంతింది వంటింట్లోకి నిర్మల, వెనకాలే పిల్లలూ, రఘూనూ.

